# డిటెక్టివ్ లెసన్ నెం. 1

డిటెక్టివ్ అప్రెంటిస్ ప్రసాద్ నాలుగోసారి అద్దంలో చూసుకొని తన టెరిలిన్ టై ముడి సరిచూసుకొన్నాడు. ఉదయం ఎనిమిదయింది. అతను ప్రఖ్యాత అపరాధ పరిశోధకుడు అవినాశ్ బాబు వద్ద నిన్ననే ఉద్యోగంలో ప్రవేశించేడు. అవినాశ్ బాబు కోరికపై అతనింట్లోకే బస మార్చేడు.

నిన్ననే చెప్పేడు అవినాశ్ బాబు మొదటిపాఠం 'కళ్ళు పెట్టిచూడు, చూసిందాన్ని బట్టి చూడనిది గ్రహించు' అని. ఉదాహరణలు యీ ఉదయం చెప్తానన్నాడు అవినాశ్.

ప్రసాద్ షైమురిడితో రాజీపడి అవినాశ బాబు గది వేపు నడిచాడు, గది ఖాళీగా వుంది. అవినాశ్ బాబు లేబొరేటరీలో వుంటారని గ్రహించాడు ప్రసాద్! తరువాత లేబొరేటరీకి వెళ్ళి చప్పుడుకాకుండా తలుపు తెరిచాడు. పొడుగాటి లేబొరేటరీలో రెండో వేపు, అవినాశ్ బాబు ఏదో ప్రయోగంలో నిమగ్నుడయి వున్నాడు. అతని వీపు ద్వారం వేపున్నా "రావోయ్ రా! కూర్చో" అని ఆయన ఆహ్వానించగానే తనరాక యెలా కనిపెట్టేశాడా అని ఆశ్చర్య పడుతూ ప్రసాద్ లోపలికి ప్రవేశించాడు.

ఆరడుగుల ఎత్తున్న డిటెక్టివ్, ప్రసాద్ వేపు నడిచి వచ్చేడు. ఒక చేతిలో టెస్ట్‌ట్యూబ్ బుస కొడుతున్నది. రెండవ చేతిలోవున్న బీకరులో ఏదో ఎర్రటి ద్రవం వుంది.

"కూర్చోవోయ్ కూర్చో!" అంటూ ప్రసాద్‌ని వొక కుర్చీలో కూర్చోపెట్టి, టెస్టుట్యూబ్‌ని బీకర్ని బీరువాలో పెట్టి ప్రసాద్ ముందు టేబిల్ మీద వోరగా కూర్చొని ప్రసాద్ వేపు చూచి నవ్వాడు అతను.

"నీ రాక ఎలా కనిపెట్టేనా అనే కాదోయ్ ఆలోచిస్తున్నావ్ ?" అని ప్రశ్నించాడు.

"కరెక్టు సార్ !" అన్నాడు ప్రసాద్.

"తలతిప్పకుండా వెనక్కి చూడ్డం నేర్చుకోవాలి"

"ఎలాసార్ !"

"ముందు అద్దం పెట్టుకుంటే సరి !"

"మీ ముందు అద్దం లేదే!"

"అద్దంలా పనిచేసే గాజు తలుపుల బీరువా వుంది కదా !"

"ఓస్! ఇంతేనా అపరాధపరిశోధన?" అని అనబోయి మానేశేడు ప్రసాద్.

"నువ్వు షిప్ మార్కు చిన్న అగ్గిపెట్టెలు వాడు తున్నావు కదూ?" అని అవినాశ్ బాబు అంటే ప్రసాద్ ఆశ్చర్యానికి మేరలేకపోయింది.

"ఎలా కనిపెట్టేసేరు సార్?" అని అడక్కుండా ఉండ లేకపోయాడు ప్రసాద్.

"చాలా సులువు. నీకు ఫేషన్లంటే యిష్టమని నీ టెరిలిన్ షైర్టు, షర్టూ నీ పర్సు, జేబులో ఉన్న 20 సిగరెట్ల ప్లేయర్స్ సిగరెట్టు పెట్టె చెప్తున్నాయి. షిప్ మార్కు చిన్న అగ్గిపెట్టెలు సిగరెట్లు కాల్చేవారికోసం ప్రత్యేకం తయారు చేస్తారు మామూలు అగ్గిపెట్టెలకంటే ఖరీదుకూడా జాస్తి. అవి యీ ఊళ్ళో అమ్మడం మొదలుపెట్టి 15 రోజులయింది. నీ కంట అవి పడకుండా వుండి వుండవని అనుకున్నా."

నిశ్చయంగా అవినాశ్ బాబు అఖండ ప్రజ్ఞాశాలి అని గ్రహించాడు ప్రసాద్.

"దీన్నే డిడెక్షన్ అంటారు. అంటే ఒక విషయంచూసి

రెండోది గ్రహించడం. నీ దగ్గరున్నది సిగరెట్టుపెట్టె. దాన్ని బట్టి నువ్వు యెలాటి వాడివో నీవు వాడుకొనే యితర వస్తువులు ఎలాటివై యుంటాయో గ్రహించగలిగి వుండాలి డిటెక్టివ్. నీ గురించి కావలిస్తే యింకా చెప్పగలను. నీకో ప్రియురాలు వుంది. కొంచెం బీదదనే చెప్పాలి. నల్లమనుష్యుల్లో జమ. అల్లికలూ, కుట్లూ అంటే ఆమెకు చాలాసరదా. ఆవిడ నీకు యిచ్చిన బహుమతుల్లో పువ్వులుకుట్టిన ఎర్రడ్రాయరు ఒకటుంది. దానిమీద యీవేళ ఉదయం నువ్వే పొరపాటున కాఫీ పోసుకున్నావు” ఎఫెక్టుకోసం ఆగేడు అవినాశు.

ప్రసాద్‌కు మూర్ఛొచ్చినంత పని అయింది. అవినాశు చెప్పినదంతా అక్షరాలా నిజం. కాని ఎలా కనిపెట్టేసేడా అన్నదే ఆశ్చర్యం!

“సార్! మీరు ఎలా...”అని ప్రసాద్ అడుగుతుంటే ‘ఇలా చెప్పగలగడం ఏంకష్టంలేదు’ అంటూ అవినాశు బాబు అడ్డొచ్చేడు. “డబ్బున్న ప్రియురాళ్ళు ఊలుస్వెట్లర్లూ పార్కర్ పెన్నులూ, స్మగుల్డ్‌వాచీలు ప్రెజెంట్సిస్తారు. ఎర్ర నూలుడ్రాయరు కానుకిచ్చిన నీ ప్రియురాలు ధనవంతురాలు కాదు. టేబిల్ క్లాత్‌లమీదా, డోర్ కర్టెన్లమీదా కుట్లు కుట్టడం రివాజే. కాని లోపల తొడుక్కునే డ్రాయరుమీద ఎంబ్రాయిడరీ సాధారణంగా చెయ్యరు. దానిమీద కూడా అందంగా పువ్వులూ కాయలూ కుట్టిందంటే నీ ప్రియురాలికి ఎంబ్రాయిడరీ అంటే విపరీతమైన యిష్టమని తెలుస్తుంది. సాధారణంగా ఎర్రరంగుని నల్ల ఆడవాళ్ళు కోరుకుంటారు.

ఆ రంగు తమకి సరిపడదని వారికి తెలుసు. ఆ రంగు బట్టలు వారికి కట్టుకునే అవకాశం లేకుండాపోతుంది. అంచేత వారు యితర్లకి బట్టలు యిచ్చేటప్పుడు ఆ రంగునే ఎన్నుకుంటారు" అని ఆగిపోయేడు.

ప్రసాద్ మెదడులో సుళ్ళు తిరగడం మొదలుపెట్టేయి. అతనికి యింకా సందేహాలున్నాయి. 'కాని ఆ డ్రాయరు ఎర్ర రంగుదనీ దానిమీద పువ్వులున్నాయని, దానిమీద కాఫీ వొలక బోసుకున్నాననీ ఎలా కనిపెట్టేరు సార్?" అని నీర సంగా ప్రశ్నించేడు.

"ఈ విషయాలు కనిపెట్టడం అన్నిటికంటె సులువు" అని నవ్వుతూ ఆగిపోయేడు అవినాశ్.

ప్రసాద్ ఆతృత ఎక్కువైంది "ఎలా—సార్!"

"మహా సులువు... నువ్వు పేంటు తొడుక్కోవడం మరచి పోయేవు ప్రసాద్" అంటూ నవ్వసాగేడు ప్రఖ్యాత డిటెక్టివ్ అవినాశ్ బాబు.

లెసన్ నెంబరు 1 :—డిటెక్టివ్ కాదల్చుకున్నవారు పేంటు తొడుక్కోవడం మరచిపోకూడదు.

అంటే, యితరులు మరచిపోవచ్చని కాదు.